

తల్లి పాలే శ్రీరామరక్ష

తల్లి పాలే శిశువుకు శ్రీరామరక్షగా నిలుస్తాయని అవగాహన కల్పించేందుకు నేటి నుంచి వారోత్సవాలు నిర్వహించనున్నారు. 8లో



విమర్శలు హద్దు దాటొద్దు

ప్రతిపక్షాల నేతలు చేస్తున్న విమర్శల్లో హద్దు దాటితే సహించేది లేదని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హెచ్చరించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా ఎంపీ నామా



ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: దక్షిణ మధ్య జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ(జెడ్‌ఆర్‌యూసీసీ) సభ్యుడిగా బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు నియమితులయ్యారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.ముత్యాల నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఎంపీ రెండేళ్ల పాటు కొనసాగుతారు. జోన్ పరిధిలోని రైల్వే వినియోగదారుల తరఫున వారికి అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ రైల్వే వినియోగదారులకు మరింత సేవ చేయడానికి ఈ పదవి చేయూతగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపీగా అనేక సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించానని తెలిపారు.

పోలీసు గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ



సమస్య తెలుసుకుంటున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో సీపీ విష్ణు ఎస్.వారియర్ పాల్గొని వివిధ ప్రాంతాల వారి నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. వీటిపై క్షేత్ర స్థాయిలో విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన డీవైఎస్‌ఓ



డీవైఎస్‌ఓకు శుభాకాంక్షలు చెబుతున్న టీఎన్జీవోస్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారిగా టి.సునీల్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని కార్యాలయంలో ఆయన పూర్వ డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి నుంచి బాధ్యతలు చేపట్టారు. కాగా, విధుల్లో చేరిన సునీల్‌కుమార్‌కు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్.వీ.ఎస్.సాగర్‌తో పాటు నందగిరి శ్రీను, కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

విలీనంపై ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల హర్షం

ఖమ్మంమామిళ్లగూడెం: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని హైదరాబాద్‌లో సోమవారం జరిగిన మంత్రివర్గ భేటీలో నిర్ణయించారు. ఈ నిర్ణయంపై ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించడంతో తమకు ఉద్యోగ భద్రత లభిస్తుందని, సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో 2,109 మంది ఉద్యోగులు, కార్మికులకు లబ్ధి చేకూరనుందని అధికార వర్గాలు తెలిపాయి.

పలువురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వరంగల్ వీఆర్‌లో ఉన్న కె.కుమారస్వామిని ఖమ్మం టూటౌన్ సీఐగా, అశ్వారావుపేట సీఐగా పనిచేసిన బొమ్మెర బాలకిషన్‌ను సీసీఎస్ సీఐ–2గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

సీసీఆర్‌బీ ఏసీపీ బదిలీ

ఖమ్మంక్రైం: ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న జి.కృష్ణ బదిలీ అయ్యారు. ఆయనను వరంగల్ సీసీఆర్‌బీకి బదిలీ చేస్తూ డీజీపీ అంజనీకుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, వెయిటింగ్‌లో ఉన్న కృపాకర్‌ను ఖమ్మం పీటీసీ ఏసీపీగా నియమించారు. ఇంకా ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా యు.సాంబరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కరువుదీరా వాన!



పాలేరు రిజర్వాయర్ నిండడంతో అలుగుల ద్వారా బయటకు వెళ్తున్న వరద (ఫైల్)

జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షపాతం

- జూన్‌లో వర్షాభావం.. జూలైలో మాత్రం కుండపోత
- సాధారణ వర్షపాతానికి మించి నమోదు
- 12మండలాల్లో 40 సెం.మీ.కు పైగానే...
- సాగుకు ఢోకా లేనట్లేనని రైతుల ధీమా

సాక్షిప్రతినిధి,ఖమ్మం: జిల్లా తడిసి ముద్దయింది. జూలైలో పలుమార్లు ఎడతెరిపి లేకుండా వాన దంచికొట్టింది. జూన్‌లో ఓవైపు ఎండలు, మరోవైపు వర్షాభావ పరిస్థితులు నెలకొనగా.. జూలైలో మాత్రం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 24.9 సెం.మీ. కాగా.. 44.5 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా చూస్తే అత్యధికంగా కామేపల్లి మండలంలో 75.8 సెం.మీ., అత్యల్పంగా మధిర మండలంలో 28.4 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారిక సమాచారం. వరుసగా వారం పాటు కురిసిన వర్షంతో జిల్లాలోని నీటి ఆవాసాలన్నీ జలకళ సంతరించుకున్నాయి.

తీవ్ర వర్షాభావం నుంచి..

నైరుతి రుతు పవనాలు ఏటా జూన్ మొదటి వారంలో జిల్లాను తాకడం ఆనవాయితీ. కానీ ఈసారి నైరుతి దోబూచులాడింది. సగటు వర్షపాతం 10.5 సెం.మీటర్లకు గత ఏడాది జూన్ నెలలో 12.సెం.మీ. వర్షపాతం నమోదైంది. అయితే, ఈసారి మాత్రం 4.5 సెం.మీ.గా మాత్రమే నమోదు కావడంతో లోటు వర్షపాతం ఏర్పడింది. దీని ప్రభావం పంటల సాగుపై పడగా.. పొడి దుక్కుల్లో వేసిన పత్తి విత్తనాలు ఎండిపోవడంతో పాటు మొక్కలు వచ్చినా నీళ్లు లేక నిలువునా ఎండిపోయాయి. అంతేకాక బోర్లు, బావుల కింద వరి సాగు ఆలస్యమైంది. ఒక దశలో అనావృష్టి పరిస్థితులు ఏర్పడుతాయా అని రైతులు ఆందోళనకు గురయ్యారు. జిల్లావ్యాప్తంగా మెట్ట పంటల సాగుకు కూడా పరిస్థితులు అనుకూలించలేదు.

వద్దన్నా.. వాన

జూన్ నెల అంతా వర్షం కోసం ఎదురుచూస్తే జూలైలో మాత్రం వద్దన్నా.. వాన కురిసింది. గత ఏడాది జూలైలో కూడా భారీ వర్షాలు కురిశాయి. జూలై సగటు వర్షపాతం అంచనా 24 సెం.మీ. కాగా, రికార్డు స్థాయిలో 44.5 సెం.మీ.గా నమోదైంది. వారం పాటు కుండపోతతో జిల్లా అంతటా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు పూర్తిగా నిండడంతో వానాకాలం సాగుకు ఢోకా లేనట్లేనని రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

నాగార్జునసాగర్ జలాలు రాకున్నా..

నాగార్జునసాగర్ రెండో జోన్ పరిధిలోని జిల్లాలో 2.80లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గతంలో ఆగస్టు మొదటి, రెండు వారాల్లో ఈ ఆయకట్టుకు నీరు విడుదలయ్యేది. కానీ ఈసారి కృష్ణా నదికి ఎగువన వర్షాలు పడకపోవడంతో సాగర్‌లోకి నీరు చేరలేదు. దీంతో ఆయకట్టుకు సాగునీటి విడుదలపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. అయితే జూలైలో కురిసిన కుంభవృష్టితో జిల్లాలోని పాలేరు, వైరా రిజర్వాయర్లు, బేతుపల్లి చెరువు, లంకాసాగర్, జాలిముడి ప్రాజెక్టులు అలుగు పడ్డాయి. మిగతా చెరువుల్లోకి సైతం పుష్కలంగా నీరు చేరింది. ఈ క్రమాన ఆగస్టులో కూడా వర్షాలు పడితే సాగుకు ఇబ్బందులు ఉండవని రైతుల్లో ధీమా వ్యక్తమవుతోంది. సాగర్ నీరు సకాలంలో రాకపోయినా రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటితో సాగు సాఫీగా సాగుతుందని చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పత్తి, మిర్చి, వరి, పెసర పంటలు సాగవుతుండగా, తాజా వర్షాలతో వరి సాగు ఊపందుకోనుంది. అలాగే ఇంకొందరు రైతులు పత్తి, మిర్చి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఒకవేళ సాగర్ నీరు కూడా విడుదలైతే రైతులకు సమృద్ధిగా నీరు అందుబాటులో ఉంటుంది.

జూలైలో అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలు (సెం.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
కామేపల్లి	74.8
కారేపల్లి	67.5
ఏన్కూరు	56.5
కూసుమంచి	50.6
సత్తుపల్లి	50.6
ఖమ్మంఅర్బన్	48.8
తిరుమలాయపాలెం	47.8
వేంసూరు	47.2
బోనకల్	43.6
పెనుబల్లి	42.2
వైరా	40.9
రఘునాథపాలెం	40.4

జూలైలో జిల్లాలోని 12 మండలాల్లో 40 సెం.మీ. మొదలు 74 సెం.మీ. వరకు సగటు వర్షపాతం నమోదు కాగా.. మిగిలిన మండలాల్లో 28 నుంచి 40 సెం.మీ. మేర సగటు వర్షపాతం నమోదైంది.

మున్నేటికి ఇరువైపులా ఆర్‌సీసీ వాల్

- మంత్రి పువ్వాడ వినతితో నిర్ణయించిన సీఎం కేసీఆర్
- త్వరలో నివేదిక తెప్పించుకుంటామన్న మంత్రి కేటీఆర్



ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన ఇళ్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలో మున్నేటి వరదకు శాశ్వత పరిష్కారం చూపించేలా రాష్ట్రప్రభుత్వం నిర్ణయాన్ని వెలువరించింది. మున్నేరుకు ఇరువైపులా నిర్మాణాలు జరగడంతో పాటు పేదలు ఇళ్ల నిర్మించుకుని జీవిస్తున్నారు. మున్నేరుకు కొద్ది వరద వచ్చినా లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరి నష్టం ఎదురవుతోంది. తాజాగా కురిసిన వర్షాలతో ఖమ్మం వద్ద మున్నేరు 30 అడుగులకు పైగా వరద ప్రవహించగా ఇరువైపులా వేల సంఖ్యలో ఇళ్లలోకి నీరు చేరింది. భవిష్యత్‌లోనూ వరదలతో ప్రమాదం పొంచి ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొన్నేళ్లుగా మున్నేరుకు కరకట్ట అవసరమనే వాదన బలంగా వినిపిస్తుండగా... ఖమ్మం నగర పొడవునా ఆర్‌సీసీ వాల్ నిర్మాణం చేపట్టాలని మంత్రివర్గం భేటీలో ప్రభుత్వం నిర్ణయించింది.

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని..

ఇటీవల కురిసిన వర్షాలు, వరదతో మున్నేరు పరివాహక ప్రాంతంలో ఎదురైన నష్టంపై సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. భవిష్యత్‌లో వచ్చే వరదను దృష్టిలో ఉంచుకొని ఖమ్మం నగరం పొడువునా మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. కరకట్ట నిర్మాణం చేపడితే చాలా మంది ఇళ్ల కోల్పోవాల్సి ఉండడంతో ఆర్‌సీసీ వాల్ నిర్మాణ ప్రతిపాదనలను సీఎం కేసీఆర్ దృష్టికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తీసుకెళ్లారు. దీంతో మంత్రివర్గ భేటీలో ఈ అంశంపై సమగ్రంగా చర్చించి ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికే మంత్రివర్గ సమావేశం మొగ్గు చూపినట్లు తెలిసింది. ఈమేరకు సీఎం కేసీఆర్ రూ.150 కోట్ల నిధులు కూడా మంజూరు చేసినట్లు సమాచారం. కేబినెట్ నిర్ణయాన్ని మంత్రి కేటీఆర్ ప్రకటించగా.. త్వరలోనే మున్నేరుకు ఇరువైపులా నిర్మించనున్న ఆర్‌సీసీ వాల్‌కు సంబంధించిన నివేదికను తెప్పించుకుంటామని వెల్లడించారు.

హర్షం వ్యక్తం చేసిన పువ్వాడ

మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణం చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు, ఖమ్మం నగర ప్రజల తరుపున సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మున్నేరు బాధితుల కష్టాలు శాశ్వతంగా దూరం చేసేలా నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

నవోదయను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



ప్రిన్సిపాల్ నుంచి వివరాలు సేకరిస్తున్న న్యాయమూర్తి జావీద్ పాషా

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజుల క్రితం విద్యార్థి హలావత్ దుర్గా నాగేందర్ విద్యుదాఘాతంతో మృతి చెందగా సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణం నుంచి వివరాలు సేకరించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయడంతో పాటు ఇతర రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆతర్వాత విద్యార్థులతో మాట్లాడారు. కాగా, విద్యార్థి మృతికి బాధ్యుడిగా ప్రిన్సిపాల్ చంద్రబాబును ఘటన జరిగిన రోజే సస్పెండ్ చేయగా, విచారణ అనంతరం ఆర్ట్ టీచర్ వీరస్వామిని కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అక్కడ రిజిస్ట్రేషన్లు చేయొద్దు...

- మున్నేరు పరీవాహకంలో గజాల లెక్కన రిజిస్ట్రేషన్లు ఉండవు
- లే ఔట్లు చేయడానికి అసలే వీల్లేదు
- మున్నేటి వరద ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ అభిలాష, అధికారులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: '2005లో మున్నేటికి ఇదే వరద వస్తే ఇంత ఇబ్బంది లేదు.. ఇన్ని ఇళ్లకు నష్టం జరగలేదు.. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. మరో పదేళ్లకు ఇదే వరద వస్తే నష్టతీవ్రత ఇంకా పెరుగుతుంది. అందుకే ముందస్తుగా ప్రణాళిక రూపొందిస్తున్నాం.. దీనిలో భాగంగానే వరద ప్రభావిత ప్రాంతాల్లో గజాల లెక్కన ఇక రిజిస్ట్రేషన్లు చేయొద్దని రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు ఇస్తున్నాం. లే ఔట్లు చేయడానికి అసలే వీలుండదు.' అని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. ఖమ్మంలోని టీటీడీసీలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద ప్రభావిత ప్రాంతంపై దృష్టి సారించి లే ఔట్లే జరగకుండా, కొత్తగా నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా మున్నేటికి సంబంధించి ఫ్లడ్ జోన్ మాన్యువల్ మ్యాప్ కూడా తయారుచేస్తున్నామని.. తద్వారా ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు భవిష్యత్‌లోనూ అధికారులకు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు.

ఇరువైపులా ఎంఎఫ్ఎల్ పిల్లర్లు

తాజాగా వచ్చిన వరద ఆధారంగా మున్నేరు నీరు ఎక్కడ వరకు చేరుతుందో నిర్ధారించి ఫ్లడ్ లెవల్ పిల్లర్లను(ఎంఎఫ్ఎల్) ఇరువైపులా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. పట్టా భూముల్లోనూ ఈ పిల్లర్లు ఉంటాయని.. దీంతో భూమిలో వ్యవసాయం తప్ప నిర్మాణాలకు అనుమతి ఉండదని వివరించారు. అలాగే, ఆయా సర్వే నంబర్లకు కూడా రిజిస్ట్రేషన్ శాఖకు ఇచ్చి గజాల లెక్కన లావాదేవీలు జరపకుండా ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. నాలా కన్వర్షన్లు, రిజిస్ట్రేషన్లు, ఎల్ఆర్ఎస్ అనుమతులు ఇక నుంచి ఉండవన్నారు. ప్రజలు ఇబ్బంది పడొద్దనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగా, జలగంనగర్‌కు సంబంధించి 36 కుటుంబాలు తాము ఇళ్లను మరమ్మతు చేసుకుని ఉండలేమని చెప్పడంతో వారికి వెంకటగిరిలో ప్లాట్లు ఇవ్వనున్నామని తెలిపారు. ఇంకా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారు ఎవరు కోరినా పునరావాసం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఖమ్మం కార్పొరేషన్‌లో 1,723, ఖమ్మం రూరల్ మండలంలో 560 కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యాయని, ఆయా ప్రాంతాల్లో కలిపి 44 ఇళ్లు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ 3,026 కుటుంబాల్లో సర్వే పూర్తి చేసిందని, రెండో దశ సర్వే కూడా మొదలవుతోందని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు 38 వాహనాలు

108, 102 వాహనాలను కేటాయించిన ప్రభుత్వం



ఖమ్మం వైద్యవిభాగం: తరచూ మరమ్మతులకు గురవుతూ అప్పుడప్పుడు మొరాయిస్తున్న 108, 102 వాహనాల స్థానంలో ప్రభుత్వం కొత్తవి కేటాయించింది. ఈమేరకు పాత వాహన స్థానంలోనే కాకుండా కొత్తగా కూడా మరికొన్ని వాహనాలు సమకూర్చింది. రాష్ట్రంలో అవసరాల కోసం 466 వాహనాలను కొనుగోలు చేయగా, వీటిని మంగళవారం హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు. ఇందులో 38 వాహనాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 108 వాహనాలు 17 ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11, ఖమ్మం జిల్లాలో ఆరు వాహనాలు తిరుగుతున్నాయి. వీటి స్థానంలో కొత్తవి కేటాయించడమే కాక ముదిగొండ, రఘునాథపాలెంకు ఒక్కో వాహనం కలిపి 19 వాహనాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. ఇక 102 వాహనాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొమ్మిది, ఖమ్మం జిల్లాలో ఏడు ఉండగా వీటికి బదులుగా కొత్తవి కేటాయించి, జిల్లాకొకటి స్పేర్ వాహనం కూడా అందుబాటులోకి తీసుకొస్తారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒక పార్థీవ వాహనాన్ని కేటాయించారు. ఆయా వాహనాలు రెండు, మూడు రోజుల్లో జిల్లాకు చేరుకోనుండగా, అప్పటి వరకు పాత వాహనాలు యథావిధిగా తిరుగుతాయని 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకుని నష్టపోవద్దు

- ఇటీవల వరదతో సముద్రంలో కలిసిన 6 లక్షల క్యూసెక్కుల నీరు
- జలవనరులశాఖ సీఈ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న సీఈ శంకర్‌నాయక్, పక్కన డీసీఈ ధన్‌కుమార్

ఖమ్మంఅర్బన్: జలాశయాల పరివాహక ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకుంటే వరదల సమయాన నష్టాలు ఎదురుకావడమే కాక ప్రాణాలను ఫణంగా పెట్టాల్సి వస్తుందని జలవనరులశాఖ సీఈ(చీఫ్ ఇంజనీర్) శంకర్‌నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. తక్కువ ధరకు ప్లాట్లు వస్తాయనే భావనతో మునక ప్రాంతాలు, బఫర్‌జోన్‌గా గుర్తించిన చోట అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించుకుంటే వరద వచ్చినప్పుడు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికే తమ శాఖ తరఫున అనుమతి లేని 915 నిర్మాణాలను గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించినట్లు తెలిపారు. కాగా, ఇటీవల భారీ వర్షాలు, వరదల ప్రభావంతో చెరువులు, సాగర్ కాల్వల పరిధిలో యూటీలు, తూముల దెబ్బతినడంతో శాఖకు రూ.కోటి మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. కాగా, జిల్లాలోని 1,053 చెరువుల్లో 529 చెరువులు అలుగు పారుతుండగా, సాగుకు ఢోకా లేనట్లేనని సీఈ తెలిపారు. ఇక జిల్లాలో అన్ని ప్రాజెక్టులు నిండి అలుగు పారడం, మున్నేరు సైతం మునుపెన్నడూ లేని స్థాయిలో వరద రావడంతో మొత్తంగా అన్ని ప్రాజెక్టుల నుండి సుమారు 6 లక్షల క్యూసెక్కుల మేర నీరు సముద్రంలోకి వెళ్లినట్లు అంచనా వేసినట్లు సీఈ చెప్పారు. ఇందులో పాలేరు రిజర్వాయర్ నుంచి 83వేల క్యూసెక్కులు, వైరా నుండి 24 వేల క్యూసెక్కులు, లంకాసాగర్ ప్రాజెక్టు నుండి 2వేల క్యూసెక్కులు, మున్నేరు నుండి 4.20లక్షల క్యూసెక్కులకు పైగా నీరు వెళ్లినట్లు తెలిపారు. కాగా, 2008లో మున్నేరులో 28.6 అడుగుల మేర నీరు రాగా, ఈసారి 30.7 అడుగుల మేర వరద రావడంతో గత రికార్డు తుడిచిపెట్టుకుపోయిందని సీఈ చెప్పారు. ఈసమావేశంలో డీసీఈ ధన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదారి తగ్గింది..

- భారీగా పడిపోతున్న నీటిమట్టం
- ప్రమాద హెచ్చరికల ఉపసంహరణ
- ఇళ్లకు చేరుకుంటున్న నిర్వాసితులు



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం: పది రోజులుగా భద్రాచలం ఏజెన్సీ ప్రజలను ఆందోళనకు గురిచేసిన గోదావరి శాంతించింది. నదికి ఎగువన ఉన్న ప్రాజెక్టు గేట్లను మూసివేయడంతో ప్రవాహం భారీగా తగ్గింది. దీంతో ఆదివారం మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించిన అధికారులు.. అర్ధరాత్రి 2 గంటలకు 48 అడుగులకు దిగువన నీటిమట్టం నమోదు కావడంతో రెండో ప్రమాద హెచ్చరిక, సోమవారం మధ్యాహ్నం 1 గంటకు 42.60 అడుగులకు పడి పోవడంతో మొదటి ప్రమాద హెచ్చరిక సైతం తొలగించారు. ఆతర్వాత కూడా క్రమంగా తగ్గుతూ వస్తున్న గోదావరి రాత్రి 11 గంటలకు 37.50 అడుగులతో 6,87,210 క్యూసెక్కుల మేర ప్రవహిస్తోంది.

శిబిరాలు ఖాళీ..

గోదావరి నీటిమట్టం 40 అడుగుల దిగువకు చేరడంతో దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో ఉన్న నిర్వాసితులు ఒక్కొక్కరుగా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇళ్లలోకి చేరిన కొద్దిపాటి వరదను శుభ్రం చేసి సామాన్లు సర్దుకుంటున్నారు. ప్రధాన రహదారులపైకి చేరిన వరద బురదను అధికారులు డోజర్ల ద్వారా తొలగిస్తున్నారు. కాలనీలు, గ్రామాల్లో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో బ్లీచింగ్, క్లోరినేషన్ పనులు చేపడుతున్నారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు





జ్వర సర్వే వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఇన్‌సెట్) మోతీనగర్‌లో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

- ప్రతీ ఇంట జ్వర సర్వే చేయాలి
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. మున్నేరు ముంపు ప్రాంతమైన 35వ డివిజన్‌లోని మోతీనగర్‌లో పర్యటించిన కలెక్టర్ సహాయక చర్యలను తనిఖీ చేశారు. ఇంటింటికీ తిరుగుతూ వరదతో జరిగిన నష్టం, జ్వర సర్వేపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో ఇంటింటి సర్వేకు 21 బృందాలు ఏర్పాటు చేయగా, ఇప్పటి వరకు 3,026 ఇళ్లలో సర్వే పూర్తయిందన్నారు. అలాగే, 10,297 మంది ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి అనారోగ్య లక్షణాలు ఉన్న 34 మందికి చికిత్స అందించినట్లు తెలిపారు. కాగా, నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటూ తాగునీటిలో క్లోరిన్ మాత్రలు వేయాలని ఉద్యోగులకు సూచించారు. కాగా, ముంపు ప్రాంతాల్లో విద్యుత్, నీటి సరఫరా పునరుద్ధరించడమే కాక పది రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ముంపు బాధితులకు సహాయార్థం దాతలు ముందుకొస్తున్నారని, ఇప్పటికే రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి రూ.కోటి అందించారని తెలిపారు. కాగా, వరదతో 16 ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా సంఖ్య మరింత పెరగవచ్చన్నారు. ఇళ్లతో పాటు దెబ్బతిన్న సామగ్రి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. వరదలకు పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో మళ్లీ నిర్మిస్తే ముప్పు ఉంటుందని, వీరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేదంటే ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, కేఎంసీ ఉప కమిషనర్ మల్లీశ్వరి, వైద్యాధికారులు సైదులు, లోహిత, శ్రావ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్యసాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిలాష

ఖమ్మం సహకారనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జిల్లాలో పారిశుద్ధ్యం, పచ్చదనం కార్యక్రమాలకు సంబంధించి లక్ష్యసాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె స్వచ్ఛ సర్వేక్షణ్, హరిత హారం, ఉపాధి హామీ పథకంపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం జిల్లాల్లో పర్యటించనుందని తెలిపారు. వీసీలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, ఏపీడీ శిరీష, డీఎల్పీఓలు పుల్లారావు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఈఈ



పాలేరు గేట్లను పరిశీలిస్తున్న ఈఈ

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను సోమవారం ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాలతో రిజర్వాయర్ అలుగుపారగా రెండు రోజుల నుండి రిజర్వాయర్‌కు వరద ప్రవాహం తగ్గింది. అయితే, వరదల కారణంగా రిజర్వాయర్ గేట్లు ఏమైనా దెబ్బతిన్నాయా అని ఈఈ పరిశీలించడమే కాక మండలంలో మత్తడి పోసిన చెరువుల వివరాలు ఆరా తీశారు. డీఈ రత్నకుమారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

శిథిల భవనం తొలగింపు మొదలు



భవనం పైఅంతస్తులో గోడలు కూల్చివేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ వ్యాపార సముదాయ భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడేం జరుగుతుందోనని వ్యాపారులు, స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా వర్షాలతో భవనం మరింత ప్రమాదకరంగా మారింది. దీంతో ఇటీవల కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పరిశీలించి పాత బస్టాండ్ వద్ద మున్సిపల్ వ్యాపార సముదాయ భవనం పైఅంతస్తు తొలగించాలని ఆదేశించారు. దీంతో సోమవారం భవనం కూల్చివేత పనులు మొదలుపెట్టారు. పాత మున్సిపాలిటీ నుండి భవనం పక్క రహదారిలో వాహనాల రాకపోకలను నిలిపివేసి పైఅంతస్తు తొలగింపు ప్రక్రియ చేపట్టారు.

ప్రయాణికుడిని చితకబాదిన ఆర్టీసీ డ్రైవర్

నేలకొండపల్లి: ప్రయాణికుడిని ఆర్టీసీ డ్రైవర్ చితకబాదిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సహచర ప్రయాణికుల అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి ఓ వ్యక్తి ఖమ్మం నుంచి సోమవారం రాత్రి నేలకొండపల్లికి వచ్చే ఆర్టీసీ బస్సులో ఎక్కాడు. అయితే, ఆయన మద్యం మత్తులో ఉండి డ్రైవర్‌ను విసిగించాడు. దీంతో కోపంతో ప్రయాణికుడిని డ్రైవర్ చితకబాదడమే కాక వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద బలవంతంగా బస్సు నుంచి గెంటేశాడు. దీంతో చేసేదేం సదరు వ్యక్తి మరో బస్సులో చేరుకోగా.. అప్పటికే తనను గెంటేసిన డ్రైవర్ బస్సు నేలకొండపల్లిలోనే ఉంది. ఈమేరకు ప్రయాణికుడు గొడవకు దిగగా మళ్లీ డ్రైవర్ దురుసుగా బదులివ్వడంతో మిగతా వారు తిరగబడ్డారు.

మత్తులో డ్రైవర్‌పై దాడి

ఖమ్మం క్రైం: మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్‌పై ఇద్దరు యువకులు దాడి చేశారు. ఖమ్మం డిపోకు చెందిన ఏసీ బస్ హైదరాబాద్ నుండి ఖమ్మం చేరుకోగా... బస్టాండ్‌లో ప్రయాణికులు దిగాక డిపోకుబయలుదేరింది. రాపర్తి నగర్ సమీపాన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు అడ్డు రావడంతో డ్రైవర్ పి.నాగేశ్వరరావు హారన్ కొట్టాడు. దీంతో హారన్ ఎందుకు కొట్టావంటూ వారిద్దరు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగడమే దాడి చేసి బస్సు అద్దాన్ని కూడా పగలగొట్టారు. ఈమేరకు స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

సివిల్స్ రాలేదని ఆత్మహత్య

ఖమ్మంక్రైం: సివిల్స్ సాధించడమే లక్ష్యంగా ఆ యువకుడు రాత్రింబవళ్లు చదివాడు. దాదాపు ఐదేళ్లుగా కోచింగ్ తీసుకుంటూ పలుమార్లు పరీక్ష రాసినా అర్హత సాధించలేకపోయాడు. దీంతో తన కల నెరవేరదనే మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం ఇందిరానగర్ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ భూక్యా రామచంద్రు కుమారుడు నాగసాయి(30) బీటెక్ పూర్తిచేసి ఐదేళ్లుగా సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు. పలుమార్లు పరీక్ష రాసినా ఎంపిక కాకపోవడంతో ఆవేదన చెందుతుండడంతో కుటుంబీకులు మానసిక వైద్యుడి వద్ద చికిత్స చేయిస్తున్నారు. ఇంతలోనే సోమవారం ఉదయం ఇంటి నుండి బయటకు వచ్చిన నాగసాయి ఎఫ్‌సీఐ గోదాం సమీపాన వందేభారత్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన చాలాసేపటివరకు రాకపోవడంతో వెతుకుతుండగా, మృతదేహాన్ని చూసిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. దీంతో త్రీటౌన్ పోలీసులు చేరుకుని రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా, స్థానికులు కొందరు నాగసాయి మృతదేహంగా గుర్తించి చెప్పడంతో తల్లిదండ్రులు రామచంద్రు – భద్రమ్మ చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. అయితే, నాగసాయి రెండురోజులుగా ఆత్మహత్య చేసుకున్న స్థలం వద్దకు వచ్చివెళ్తున్నాడని, అక్కడ ఎవరూ లేనిది చూసి బలవన్మరణానికి పాల్పడినట్లు స్థానికుల ద్వారా తెలిసింది.




నాగసాయి (ఫైల్)

తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష



ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న మిడ్‌వైఫ్, నర్సులు



- ముర్రుపాలతో రోగనిరోధక శక్తి
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- ఈ ఏడాది ఉద్యోగస్తులైన మహిళలకు ప్రత్యేక అవగాహన

సత్తుపల్లిటౌన్: శిశువులకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రోగ నిరోధక శక్తికి పెండంతో తల్లి పాల పాత్ర కీలకమైనది. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రు పాలు పట్టిస్తే తల్లీబిడ్డకు శ్రీరామరక్ష అని వైద్యులు చెబుతుంటారు. బిడ్డ పుట్టిన నాలుగురోజుల వరకు పాలు రావని కొందరు తల్లులు అపోహ పడి ముర్రుపాలు బిడ్డకు పట్టడం లేదు. ఇలాంటి అపోహలు వీడి బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు రోజు 8–10 సార్లు పాలను పడితే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరగడమే మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుంది. కాగా, కొందరు తల్లి పాలకు బదులు డబ్బా పాలు పట్టిస్తుడడంతో శిశువులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇలాంటివి అరికట్టేందుకు గాను ప్రభుత్వం ఏటా ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను అవగాహన కల్పి స్తోంది. ఈనేపథ్యాన మంగళవారం నుంచి వారోత్సవాలు మొదలుకానుండగా, జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఉద్యోగులు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించనున్నారు. కాగా, ఈ ఏడాది ఉద్యోగస్తులైన మహిళలు పిల్లలకు తల్లి పాలు పట్టేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

జిల్లాలో వివరాలు...

అంగన్‌వాడీ కేంద్రాలు	1,840
0–6 ఏళ్ల పిల్లలు	74,350
గర్భిణులు	8,761
బాలింతలు	6,236

తల్లి పాల విశిష్టత

మహిళ ప్రసవించాక వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఈ పాలు బిడ్డకు ఇవ్వకుండా వృథా చేసి తర్వాత వచ్చే పాలు మాత్రమే పడుతుంటారు. కానీ ముర్రుపాలలోనే శిశువుల్లో రోగనిరోధక శక్తిని పెంచే గుణం, మాంసకృతులు, విటమిన్లు ఉంటాయి. ఈ పాలు పట్టడం వల్ల పిల్లల్లో చురుకుదనం, తెలివితేటలు పెరుగుతాయి. అందుకే శిశువులకు అమ్మపాలు తాగించి ఆరోగ్యంగా ఉంచాలని వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

రక్తహీనత నుంచి దూరం

తల్లిపాలతో శిశువుకు సంతులిత ఆహారం అందుతుంది. ప్రొటీన్లు, విటమిన్లు ఉండటంతో కాల్షియం నిల్వలు పెరిగి బిడ్డకు రక్తహీనత దూరం చేస్తుంది. అలాగే, మనో వికాసం, మెదడు అభివృద్ధి చెందుతుంది. డయేరియా, న్యూమోనియా, క్యాన్సర్, గుండెజబ్బులు, ఎలర్జీ, ఆస్తమా, డయాబెటీస్ వ్యాధుల నుంచి రక్షణ లభించి ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి.

అనుబంధం పెరుగుతుంది

తల్లులు బిడ్డకు పాలు పట్టడం ద్వారా బరువు పెరగటాన్ని నియంత్రించటమే కాకుండా తల్లీబిడ్డ నడుమ అనుబంధాన్ని పెంచుతుంది. శరీరంలోని కొవ్వు కరిగించి ఊబకాయం, రొమ్ము కేన్సర్ బారిన పడకుండా కాపాడుతుంది. అలాగే, ఎముకలు విరగకుండా ధృఢంగా తయారవుతాయి. ఇంకా బ్రెస్ట్ కేన్సర్ నుంచి రక్షణ లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

రోగ నిరోధక శక్తికి..



తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ కల్పిస్తాయి. రెండు సంవత్సరాల వరకు తల్లి పాలనే తాగించాలి. తద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తల్లిపాలు తాగిన పిల్లలు చురుగ్గా ఉంటారు. ముర్రుపాలతో తల్లీబిడ్డకు ఎంతో మేలు జరుగుతుంది.

– ఎస్.కే.మౌలాలీ, పిల్లల వైద్యుడు, సత్తుపల్లి

అపోహలు వీడితేనే..



పిల్లలకు పాలు ఇస్తే ఆరోగ్యం దెబ్బతింటుందని, అందం కోల్పోతామని కొంతమంది తల్లులు అపోహ పడుతుంటారు. అందుకే పిల్లలకు పాలు ఇవ్వడానికి వెనుకడుగు వేస్తారు. కానీ ఇలాంటి అపోహలన్నీ విడనాడి పిల్లలకు తల్లిపాలు పట్టించటం ఎంతో శ్రేయస్కరం.

– వసుమతీదేవి, గైనకాలజిస్ట్, సత్తుపల్లి

అవగాహన కల్పిస్తాం..



వారం పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. గర్భిణులు, బాలింతలను కలుస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తాం. తల్లికి పాలు పడేలా తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తాం.

– ఎ.కొండమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ, సత్తుపల్లి

నిండా ముంచిన చెక్‌డ్యామ్

అసంపూర్తి పనులతో మునిగిన పంటలు

నేలకొండపల్లి: చెక్‌డ్యామ్ నిర్మిస్తే తమ కష్టాలు తీరుతాయని రైతులు భావిస్తే అదే వారి పాలిట శాపంలా మారింది. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి రైతులు నిండా మునిగారు. వివరాలు... ఖమ్మం, సూర్యాపేట జిల్లాల సరిహద్దు గ్రామమైన మండలంలోని పైనంపల్లిలో ఏటిపై 2021లో చెక్‌డ్యామ్ నిర్మించారు. అయితే, పనులు పూర్తిచేయకపోగా, కరకట్ట నిర్మిస్తామని చెప్పటంతో రైతులు అంగీకరించారు. కానీ డ్యామ్‌కు ఇరువైపులా కనీసం మట్టితో పూడ్చలేదు. దీంతో తాజాగా వచ్చిన వరదతో నీరు చెక్‌డ్యామ్ పైనుంచి పక్కకు వచ్చి రైతుల పొలాల్లో పారుతున్నాయి. ఫలితంగా చిన్న, సన్నకారు రైతుల భూముల్లో పంటలు కొట్టుకుపోయి ఇసుక మేటలు వేసింది. అంతేకాక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు కూలిపోయి భూమిలో గొయ్యిలు ఏర్పడ్డాయి. చెక్‌డ్యామ్ నిర్మాణం పనులు పూర్తికాకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ఇకనైనా చెక్‌డ్యామ్ పూర్తిచేయించి కరకట్ట నిర్మాణం చేపట్టాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు మారగాని నాగయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు డిమాండ్ చేస్తున్నారు.



పైనంపల్లి చెక్‌డ్యామ్ పక్కన వరిపోలంలో ఇసుక మేటలు



చెక్‌డ్యాంకు ఓ పక్క కట్ట పోయిన దృశ్యం

సాంకేతిక లోపంతో తెరుచుకోని రైల్వేగేట్

కారేపల్లి: కారేపల్లిలోని కారేపల్లి–ఇల్లెందు ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే గేట్(2కేకే) సాంకేతిక లోపంతో తెరుచుకోకపోవటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పడిన రైల్వేగేట్ రాత్రి 9గంటలైనా తెరుచుకోలేదు. దీంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సాంకేతిక నిపుణులు వచ్చి మరమ్మతులు చేసినా ఫలితం లేకపోవడంతో కొందరు వాహనదారులు పేరుపల్లి రైల్వేగేట్ నుంచి భీక్యాతండా, సూర్యతండా, ఎన్టీఆర్ నగర్, అప్పాయిగూడెం మీదుగా ఇల్లెందుకు వెళ్లారు.

విప్లవోద్యమంలో కీలకంగా వ్యవహరించిన లింగన్న

వర్ధంతి సభలో ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: భూమి,భుక్తి, విముక్తి కోసం కొనసాగిన విప్లవ ఉద్యమంలో లింగన్న ప్రధాన భూమిక పోషించారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం లింగన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ రోళ్లగడ్డ వద్ద జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆయన మరణించారని గుర్తుచేశారు. పేదలకు పోడు భూములు సాధించడంలో క్రియాశీలక పాత్ర పోషించాడని తెలిపారు. కాగా, భారీ వర్షాలతో నష్టపోయిన రైతులు, పేదలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, పుల్లయ్య, ఆవుల అశోక్, శిరోమణి, ఝాన్సీ, లలిత పాల్గొన్నారు.



లింగన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రెండు రోజుల ఉద్రిక్తతకు తెర

- మృతుడి కుటుంబానికి భూమి, పరిహారం ఇచ్చేందుకు అంగీకారం
- ఎట్టకేలకు అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబం

తిరుమలాయపాలెం: మండలంలోని మేకలతండా గ్రామపంచాయతీ పరిధి కుక్కలతండాలో రెండు రోజులుగా నెలకొన్న ఉద్రిక్తతకు తెరపడింది. అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఏర్పడ్డ భూవివాదంలో ఘర్షణ జరగగా ఇస్లావత్ భద్రు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ 29వ తేదీ శనివారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు కాగా.. ఆదివారం ఆయన మృతదేహాన్ని కుక్కలతండాకు తీసుకొచ్చారు. అయితే, ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతాయనే సమాచారంతో కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సైలు వరాల శ్రీనివాస్, బి.సతీష్, రమేష్ ఆధ్వర్యాన భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, భద్రు మృతికి కారకులైన వారి నుండి భూమితో పాటు నగదు పరిహారం ఇప్పించే వరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని రెండు రోజులుగా మృతదేహాన్ని భద్రు ఇంటి ఎదుటే ఉంచారు. దీంతో సోమవారం గ్రామ పెద్దలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి భద్రు మృతికి కారకులుగా కేసు నమోదైన వారితో చర్చించగా రెండు ఎకరాల భూమితో పాటు రూ.10లక్షలు పరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. అంతేకాకుండా భూమి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేయడంతో సోమవారం రాత్రి భద్రు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడంతో స్థానికులతో పాటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

106 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): జూలైలో భారీ వర్షాలు కురిసినా సింగరేణి కొత్తగూడెం ఏరియాలో నిర్దేశిత 10.19 లక్షల టన్నులకుగాను 10.72 లక్షల టన్నుల(106 శాతం) బొగ్గు ఉత్పత్తి నమోదైంది. ఈవివరాలను సోమవారం ఏరియా జీఎం షాలెం రాజు వెల్లడించారు. జిల్లాలో లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి చేయడమే కాక 256 రేక్‌ల బొగ్గును రవాణా చేసి సంస్థ వ్యాప్తంగా ఏరియా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కాగా, జేవీఆర్‌ఓసీ–2లో 7.50 లక్షల టన్నుల లక్ష్యానికి 7.87 లక్షల టన్నులు(105 శాతం), కిష్టారం ఓసీలో 1.50 లక్షల టన్నుల లక్ష్యానికి 1.98 లక్షల టన్నులు(132శాతం) సాధించిందని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు కోటిరెడ్డి, వెంకటేశ్వరరావు, సామ్యేల్ సుధాకర్, రామకృష్ణ, యోహాన్, రమణారెడ్డి, మురళి, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు గుండెపోటు

చేనులోనే కుప్పకూలి మృతి



బన్సీలాల్ (ఫైల్)

కారేపల్లి: అరక కట్టి పత్తి చేనులో పాటు చేస్తుండగా.. ఒక్కసారిగా గుండెపోటు రావటంతో కుప్పకూలిన రైతు మృతి చెందాడు. కారేపల్లి మండలం వెంకిట్యాతండా గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన ఆంగోతు బన్సిలాల్(48) మూడు ఎకరాల భూమిలో వేసిన పత్తి పంటలో భార్య హంకీతో కలిసి పాటు చేస్తున్నాడు. ఈక్రమంలో బన్సీలాల్‌కు ఒక్కసారిగా గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. దీంతో హంకీ కేకలు వేయగా సమీప రైతులు వచ్చి చేను బయటకు తీసుకొస్తుండగానే మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ఓ కుమారుడు రవికుమార్ రెండు నెలల క్రితం చీమలపాడులో గ్యాస్‌సిలిండర్ పేలిన ఘటనలో కాలు పోగొట్టుకుని ఇంటికే పరిమితం కాగా, ఇప్పుడు తండ్రి మృతి చెందడంతో విషాదం అలుముకుంది.

గెట్టు పంచాయితీలో కొడవలితో దాడి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 15వ డివిజన్ కొత్తగూడెంలో పొలం గెట్టు విషయమై సమీప బంధువులు సోమవారం ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో కొడవలితో దాడి చేయడంతో తండ్రీకుమారులైన పి.నర్సింహారావు, గోపీచంద్ గాయపడ్డారు. వివరాలు... కొంతకాలంగా నర్సింహారావు, సమీప బంధువువైన రఘుకు పొలం విషయమై ఘర్షణ జరుగుతోంది. సోమవారం కూడా ఘర్షణ పడగా, నర్సింహారావు, గోపిపై రఘు, లక్ష్మణ్, మహేష్ తదితరులు దాడి చేయడంతో గాయపడ్డారు. ఈ విషయంపై ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరిని వివరణ కోరగా ఘర్షణ జరిగినట్లు తెలిసినా, ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో లారీ ఆటోను ఢీకొట్టగా ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మండలంలోని ఆచార్లగూడెం క్రాస్ వద్ద సోమవారం రాత్రి ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న లారీ.. నేలకొండపల్లి నుంచి ప్రయాణికులతో ఖమ్మం వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో ముందు భాగం దెబ్బతినగా ప్రయాణిస్తున్న స్వల్ప గాయాలయ్యాయి. హైవే నిర్మాణ పనుల నేపథ్యాన ఇరుకైన రహదారిలో వాహనాలు వచ్చివెళ్తుండడం, లారీ డ్రైవర్ అజాగ్రత్తగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని బారుగూడెం పరిధి మహ్మదీయ కళాశాలలో బీఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్న బల్మూరి నరేష్(19) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా గుడిబండ శివారు కొండనాగుల గ్రామానికి చెందిన నరేష్ మహ్మదీయ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతూ కళాశాల సమీపంలోని వాయుపుత్రనగర్‌లో అద్దె గదిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఆయన కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తుండగా, ఆమె నిరాకరించినట్లు తెలిసింది. దీంతో మనస్థాపానికి గురైన నరేష్ స్టీల్ గ్రిల్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్నేహితులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

ఆ‘పాత’ జ్ఞాపకం.. మధురం



పూర్వవిద్యార్థులు, సహచర గురువులతో రామచంద్రమూర్తి

- 50 ఏళ్ల తర్వాత తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థుల భేటీ
- ముఖ్యఅతిథిగా సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి

ఖమ్మంసహకారనగర్: చిన్నతనంలో కలిసి చదువుకున్నారు... ఆతర్వాత ఉన్నత చదువులు, ఆపై ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారందరూ మళ్లీ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకుని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సమ్మేళనంలో సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి సైతం పాల్గొని మాట్లాడారు. తల్లాడలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1973–74 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు యాభై ఏళ్ల తర్వాత ఖమ్మంలో సోమవారం సమావేశమయ్యారు. ఈ బ్యాచ్‌కు పాఠాలు బోధించిన సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకుని ఇక్కడే గురువుగా పాఠాలు బోధించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇన్నాళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని.. చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని సూచించారు. పూర్వ సమాజం పూనుకుంటేనే విద్యారంగం అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. అనంతరం గురువులు రామచంద్రమూర్తితో పాటు చిమ్మపూడి శ్రీరామమూర్తి, కె.శ్రీనివాసరావు, జె.సత్యనారాయణ, నారాయణరెడ్డి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దామోదర్ ప్రసాద్, పూర్వ విద్యార్థులు అనుమోలు బుద్ధిసాగర్, బేబి శంకర్, ఎన్.సత్యనారాయణ, మంగపతిరావు, జి.సునంద, పూనాటి పిచ్చయ్య, భాస్కర్‌రావు, శంకర్‌రావు, నంబూరు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విమర్శల హద్దు దాటితే సహించం..

- ప్రకృతి వైపరీత్యాలపై నీచ రాజకీయం తగదు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: రాజకీయ స్వార్థం కోసం సభ్యత మరిచి విమర్శలు, వ్యక్తిగత దూషణలకు దిగుతున్న వారు ఇకనైనా తీరు మార్చుకోకపోతే అదే స్థాయిలో బదులివ్వాల్సి వస్తుందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హెచ్చరించారు. సత్తుపల్లిలో సోమవారం ఆయన 159 మందికి రూ.24.76 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ అవసరాల కోసమే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అటూఇటు ఊగిసలాడే వాళ్లు తన వద్దకు రావాల్సిన అవసరం లేదని, తనతో ఉండేవాళ్లే కలిసేందుకు క్యాంప్ ఆఫీస్‌కు రావాలని సూచించారు. అలాగే, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ జరుగుతున్న అభివృద్ధిని కళ్లకు కట్టేలా వివరించేందుకు ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. వచ్చే అక్టోబర్ నుంచి నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు.

ఎంపీ పార్థసారధిరెడ్డి దానగుణం

ఖమ్మంలో మున్నేరు వరదతో నష్టపోయిన వారికి అండగా నిలిచేందుకు రూ.కోటి విరాళంగా ఇచ్చిన రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డికి ఎమ్మెల్యే సండ్ర కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే సత్తుపల్లిలో గ్రంథాలయ నిర్మాణం, కందుకూరులో జూనియర్ కళాశాల భవనం నిర్మిస్తున్నారని చెప్పారు. కాగా, ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసమవుతున్నందున రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు, ఎంపీపీలు దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్య, పగుట్ల వెంకటేశ్వరరావు, బీరెల్లి రఘు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ఎస్.కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావు, నాయకులు పసుమర్తి చందర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మండపాటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి పుష్కరిణి మూసివేత

తిరుమల: శ్రీవారి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు గాను మంగళవారం నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేస్తున్నారు. నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. పుష్కరిణి మరమ్మతుల కోసం మొదటి పది రోజుల పాటు నీటిని తొలగిస్తారు. ఆ తర్వాత పది రోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తి చేస్తారు. చివరి పది రోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలోని నీటి పీహెచ్ విలువ ఏడు ఉండేలా చూస్తారు. టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో టీటీడీ షవర్లు ఏర్పాటు చేసింది.

కొత్త న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

- బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్
- సీజేతో కలిపి 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న సీజే జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా జస్టిస్ కశాసికం సుజన, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఫస్ట్ కోర్టు హాల్లో ఉదయం 9.45 గంటలకు జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన సుజన, లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్‌లను అదనపు జడ్జీలుగా నియమిస్తూ రాష్ట్రపతి గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరి నియామకంతో హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. ఇంకా శాశ్వత, అదనపు న్యాయమూర్తులు కలిపి 12 ఖాళీలున్నాయి. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే కొత్త న్యాయమూర్తులు కేసుల విచారణలో పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

సోమవారం సాయంత్రం తెలంగాణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త న్యాయమూర్తులు జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్ కుమార్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులపై సర్కార్ నిర్లక్ష్యం

కిషన్‌రెడ్డి, ఈటల సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సంజీవరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో ప్రజలు నష్టపోయి అల్లాడుతుంటే వారిని ఆదుకోకుండా కేసీఆర్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 900 కోట్లకుపైగా ఉన్న జాతీయ విపత్తు నిధులతో బాధితులకు తాత్కాలిక సాయం కూడా అందించలేకపోయిందని ధ్వజమెత్తారు. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు సర్కార్ నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపించిందన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డితోపాటు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల, జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు సంజీవ్‌రావు (చెన్నూరు), అమరురాజుల శ్రీదేవి (బెల్లంపల్లి) ఆమె భర్త, బెల్లంపల్లి మాజీ మున్సిపాల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 అసెంబ్లీ సీట్లు గెలుస్తామని, మరో 10 మంది సీనియర్ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని వెల్లడించారు.

సోయం వివరణ కోరతాం...

'ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు గిరిజన రిజర్వేషన్లపై చేసిన ప్రకటన ఆయన వ్యక్తిగతం. ఈ ప్రకటనతో పార్టీకి సంబంధం లేదు. దీనిపై ఆయన వివరణ తీసుకుంటాం. గిరిజన రిజర్వేషన్ల కోసం పోరాటంలో బీజేపీ ముందుంటుంది. అధికారంలోకి రాగానే లంబాడాలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుంది. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గిరిజనులకు అన్యాయం జరిగింది. జనాభా ప్రాతిపదికన ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

గుడిబండ..'అప్పు'డే!

టీడీపీ దిగిపోయే నాటికి రాష్ట్రంపై రుణ భారం రూ.2,64,451 కోట్లు

ఇప్పుడు నాలుగేళ్లలో రూ.1,77,991 కోట్లే

- పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలు మరోసారి వెలుగులోకి
- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఏపీ అప్పులు
- లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, అమరావతి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అప్పులపై టీడీపీతో పాటు దాని అనుబంధ ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో మరోసారి తేలిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన అప్పులు రూ.1,77,991 కోట్లు మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో స్పష్టం చేశారు. 2019 నాటికి ఏపీకి రూ.2,64,451 కోట్లు అప్పులుండగా 2023 మార్చి నాటికి రూ.4,42, 442 కోట్లకు చేరినట్లు తెలిపారు. ''ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అసెస్ చేస్తోందా? 2019 మే నుంచి ఏపీ ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసింది? ఆర్థిక పరిస్థితిని అంచనా వేశారా?..'' అంటూ నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధనల మేరకు వ్యవహరిస్తోందని తేల్చి చెప్పారు. ద్రవ్యలోటు తగ్గింపు, వివేకంతో కూడిన రుణ నిర్వహణ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల్లో సుస్థిరత, పారదర్శకతను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్‌బీఎంను అసెంబ్లీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులకు లోబడే ఏపీ అప్పులు ఉన్నాయని వెల్లడించారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులను, ఆర్థిక పరిమితులను అమలు చేస్తున్నారా.. లేదా? అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన వ్యయ విభాగం పరిశీలన చేస్తూ ఉంటుందని వివరించారు.

కాకి లెక్కలతో పరిపాటిగా..

టీడీపీ దుష్ప్రచారానికి నిత్యం వంత పాడుతున్న ఎల్లో మీడియా అప్పులపై తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో మరోసారి తేటతెల్లమైంది. ఒకసారి రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశారని, మరోసారి రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ కాకి లెక్కలతో కథలు అల్లటం ఎల్లో మీడియాకు రివాజుగా మారింది. ఈ విష ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నా రహస్యంగా అప్పులను దాచారనే విధంగా ఎల్లో మీడియా అవాస్తవాలను వండి వారుస్తోంది. పరిమితులకు లోబడే అప్పులు తీసుకుంటున్నామని, టీడీపీ హయాంతో పోలిస్తే పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలు స్పష్టం చేసింది. తీసుకున్న అప్పులను సామాజిక హితం కోణంలోనే ఖర్చు చేస్తోంది. భారీగా సంక్షేమ పథకాలు, నగదు బదిలీతో పేదలకు లబ్ధి చేకూరుస్తోంది. కోవిడ్ సమయంలోనూ డీబీటీతో పేదలను ఆదుకోవడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించకుండా చర్యలు తీసుకుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఇవన్నీ ముమ్మాటికీ నిజమని రుజువైంది. ఈ గణాంకాలను ఆర్బీఐ నివేదిక ప్రకారం వెల్లడిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా పాఠకులకు తప్పుడు సమాచారాన్ని చేరవేయకుండా విశ్వసనీయతతో జర్నలిజం విలువలను పాటించాలని ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ఆ 3 పార్టీలూ ఒక్కటే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంల డీఎన్ఏ ఒక్కటే
- అందుకే ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నాయి
- కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదు
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం ఒక్కటే. ఈ మూడు కుటుంబ పార్టీలే. వాటి డీఎన్ఏ కూడా ఒకటే. అందుకే ఆ మూడు పార్టీలు యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి)ను వ్యతిరేకిస్తున్నాయి. ముస్లిం మహిళలకు హక్కులు వద్దంటున్నాయి..'అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఈ మూడు పార్టీలు ఒకే గూటి పక్షులు. గతంలో పొత్తు పెట్టుకున్నాయి. ఇందులో ఎవరికి ఓటేసినా బీఆర్‌ఎస్‌కు వేసినట్లే..'అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మహా ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగసభలో, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి ఉద్దేశపూర్వకంగా బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ఏ పార్టీతో కలవలేదని, భవిష్యత్తులో కూడా కలవబోదని చెప్పారు. ప్రజలను మోసం చేసిన చరిత్ర సీఎం కేసీఆర్‌దని, గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం ఖాయమని చెప్పారు.

ఇప్పటికీ వైఎస్ హయాంలోని రేషన్ కార్డులే..

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన రేషన్‌కార్డులే తప్ప.. తెలంగాణలో కొత్తవి రాలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డులివ్వాలనే సోయి కేసీఆర్ సర్కారుకు లేదని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి.. వెన్నుపోటు పొడిచారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు ఎరువులు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాల్లో నిప్పులు పోశారని, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని, దళితబంధు స్కీంను అమ్ముకుంటున్నారని, బీసీ బంధు పేరిట ఆ వర్గాలను మభ్యపెడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు.

బీఆర్‌ఎస్ ఆట కట్టించాలి..

దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో నాలుగు కోట్లకు పైగా ఇళ్లు కట్టించామని, తెలంగాణలోనూ ఇళ్లు కట్టించాలని కోరినా ఇక్కడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్లు లేవు కానీ.. ప్రజాధనం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ముఖ్యమంత్రి రాజభవనాన్ని కట్టుకున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా లిక్కర్ తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణను దోచుకుంటున్న బీఆర్‌ఎస్ ఆట కట్టించాల్సిన అవసరముందని అన్నారు.

నియంత పాలనను అంతమొందిస్తాం: డీకే అరుణ

తెలంగాణలో నియంతపాలన అంతమయ్యే దాకా బీజేపీ నిద్రపోదని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఈ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చే వరకూ వదలబోమని, కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వకుంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక తామే ఇస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

సింగరేణిలో వైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేసేందుకు సోమవారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాయలంలోని ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 30 పోస్టులను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయనుండగా 84 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను డైరెక్టర్(పా) బలరామ్ పరిశీలించారు. అధికారులు కట్టా బసవయ్య, బి.వెంకటేశ్వర రెడ్డి, పి.వేణుగోపాల్‌రావు, డి.నాగేశ్వరరావు, డాక్టర్ సునీల, నాగరాజు, సంతోష్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్'లో చేరండి..

కారేపల్లి: ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందడం ద్వారా ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ చెరుకుమల్ల శ్రీనివాసరావుతో కలిసి ఆయన వాల్‌పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. చదువు మధ్యలో మానేసిన వారికి ఈ విధానం వరమని తెలిపారు.

నేడు సామూహిక వ్రతాలు

ఖమ్మంగాంధీచౌక్: అధిక శ్రావణ పౌర్ణమి సందర్భంగా టీటీడీ సహకారంతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన మంగళవారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగాం అసిస్టెంట్ కర్నాటి రామకృష్టారెడ్డి తెలిపారు. మధిర మండలం దెందుకూరులోని శ్రీ కోదండ రామాలయం, ఇల్లెందు జేకే కాలనీలోని శ్రీ హరిహర క్షేత్రంలో వ్రతాలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, భక్తి, నీతి కథలపై పాఠశాల విద్యార్థులకు 3వ తేదీన కొత్తగూడెంలోని శ్రీ మాస్టర్ ఈకే విద్యాలయంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు రామకృష్టారెడ్డి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి

పాల్వంచ రూరల్: పాల్వంచలోని ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి 12గంటలకు జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పాల్వంచ మండలం నాగారం కాలనీలో మన్యం దేవీప్రసాద్ (26) పోస్ట్‌మ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ద్విచక్ర వాహనంపై మరొకరితో కలిసి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంపై ఉన్న మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, అతివేగంగా వెళ్తుండడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. దేవీప్రసాద్ స్వస్థలం ఏపీలోని జగ్గయ్యపేట మండలం సీతారాంపురమని తెలిసింది.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ..

- వరి సాగులో వెదజల్లే పద్ధతిపై రైతుల ఆసక్తి
- క్రమంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఇదే మేలంటూ సూచనలు



విత్తనం వెదజల్లే పద్ధతిని పరిశీలిస్తున్న అధికారులు (ఇన్‌సెట్) వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి (ఫైల్)

ఇల్లెందురూరల్: పంటల సాగులో నానాటికీ ఖర్చులు పెరుగుతున్నాయి. ఈనేపథ్యాన నూతన విధానాలు, సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకుంటున్న పలువురు రైతులు ఖర్చు తగ్గించుకుని లాభసాటి దిగుబడులు పొందేలా ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ప్రధాన పంట అయిన వరి సాగుకు కూలీల అవసరం పెరుగుతుండడంతో అందుబాటులోకి వచ్చిన నూతన విధానాలపై రైతులు మక్కువ కనబరుస్తున్నారు. అందులో ఒకటి విత్తనం వెద జల్లే పద్ధతి. ఈ పద్ధతిలో నారు పెంచడం, నాట్లు వేయడం తదితర పనులేమీ లేకపోవడంతో ఖర్చు తగ్గుతోంది. అంతేకాక తాజా వర్షాలతో పలుచోట్ల నారు కొట్టుకుపోయినందున ఈ విధానం మేలని అధికారులు సూచిస్తున్నారు.

సాగు ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా..

మారుతున్న పరిస్థితుల్లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. అయితే, నార్లు పోసి, నాట్లు వేయడం రైతుకు భారంగా మారింది. రోజురోజుకు కూలీల కొరతతో పాటు రేట్లు కూడా పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో చీడపీడలు, వాతారణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా సరైన దిగుబడి రాక నికర ఆదాయం తగ్గుతోంది. ఈనేపథ్యాన సంప్రదాయ పద్ధతిలో కాకుండా ప్రత్యామ్నాయ పద్ధతి అయిన వెదజల్లే పద్ధతి వైపు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు.

ఏమిటీ విధానం?

సాధారణంగా వరి సాగు చేసే అన్ని నేలలు వెదజల్లే పద్ధతికి అనుకూలంగా ఉంటాయి. వరి నాటు వేసే విధానంలో మాదిరిగానే భూమిని చదునుగా చేసుకోవాలి. అలాగే, అనువైన రకాలను ఎంచుకుని విత్తన శుద్ధ చేయాలి. ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటర్ నీటిలో కిలో విత్తనం చొప్పున శుద్ధి చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో సన్న రకాలైతే ఎకరానికి 15 నుంచి 16 కిలోలు, దొడ్డురకాలైతే 18 నుంచి 20 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి 12 నుంచి 24 గంటలు మండె కడితే విత్తనాల ముక్కు పగిలి తెల్ల మోసు వస్తుంది. వీటిని నేరుగా పొలంలో వెదజల్లొచ్చు. ఒక ఎకరంలో చల్లడానికి రెండు గంటలు సరిపోతుండగా, ఒక రోజులో 3 నుంచి 4 ఎకరాల్లో విత్తుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

సంప్రదాయ పద్ధతిలో వరి సాగు చేసే రైతులు దుక్కులు సిద్ధం చేయడం, బురదనీటలో దున్నడం, గొర్రుతో చదును చేయడం, ఆ తర్వాత నారు నాటాల్సి ఉంటుంది. దీనికి ముందు నారు మడి సిద్ధం చేసి నారు పెంచాలి. కానీ వెదజల్లే పద్ధతిలో దుక్కులు సిద్ధం చేసుకుని నేలను చదును చేసి విత్తనాలు వెదజల్లితే సరిపోతుంది. ఈ పద్ధతిలో ఎకరానికి సుమారుగా రూ.6 వేల వరకు ఖర్చు తగ్గుతుందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా కనీసం పది రోజుల ముందే పంట చేతికొస్తుంది. ఇంకా దిగుబడి కూడా పెరుగుతుందని చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

వెదజల్లే విధానంలో కూడా సాధారణ పద్ధతిలాగే ఎరువుల మోతాదు సరిపోతుంది. కాకపోతే దమ్ములో నత్రజని ఎరువులు వేయకుండా కేవలం సిఫారసు చేసిన మోతాదులోనే భాస్వరం ఎరువు, సగం పొటాష్ ఎరువులు వేయాలి. నత్రజని ఎరువులను మూడు భాగాలుగా చేసి విత్తనం వేసిన 20, 40, 60 రోజులకు వేయాల్సి ఉంటుంది. మూడో దఫా నత్రజని ఎరువు వేసే సమయాన మిగిలిన సగం పొటాష్ ఎరువు వేసుకోవాలి. విత్తనం వెదజల్లిన 3 - 4 రోజులకు 80 నుంచి 100 గ్రాముల పైరజో సల్ఫ్యూరస్ ఇథైల్ కలుపు మందును ఎకరం పొలంలో పిచికారీ చేయాలి. విత్తిన 15 నుంచి 20 రోజుల దశలో కలుపు ఉంటే వెడల్పాటి ఆకు, గడ్డి జాతి నివారణకు ఎకరానికి ట్రయఫామోస్ ఇథాక్స్ కలిపి సల్ఫ్యూరస్ 90 గ్రాములు లేదా పెనాలక్సులమ్ సైహాల్‌పాప్ బ్యూటైల్ 800 మి.లీ. మందును 2 నుంచి 3 ఆకుల దశలో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. వరుసలో ఉన్న కలుపును అంతర్‌కృషి ద్వారా సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది



ప్రస్తుతం వరిలో సాగు ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో వెదజల్లే పద్ధతి మంచి ఫలితాలను ఇస్తోంది. ఈ విధానం ద్వారా ఎకరాకు సుమారు రూ.6 వేల ఖర్చు తగ్గడంతోపాటు కూలీల కొరతను అధిగమించవచ్చు. ఇలా అనేక లాభాలు ఉండడంతో రైతులు వెద పద్ధతిపై ఆసక్తి చూపుతున్నారు.

– సతీష్, ఏఓ, ఇల్లెందు మండలం

మాణిక్‌రావ్ ఠాక్రేతో జానారెడ్డి, పొంగులేటి భేటీ


ఠాక్రేతో సమావేశమైన జానారెడ్డి, పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రేతో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. మాజీ మంత్రి జానారెడ్డి నివాసంలో జరిగిన భేటీలో ప్రజావ్యతిరేక బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా అవలంభించాల్సిన విధివిధానాలపై చర్చించినట్లు పొంగులేటి తెలిపారు. కాగా, సీనియర్ కాంగ్రెస్ నాయకుల సలహాలు, సూచనలతో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

గురుకులాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ


గురుకులంలో ప్రార్థన చేస్తున్న పీఓ ప్రతీక్, అధికారులు, విద్యార్థులు


పీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: వరదలు తగ్గుముఖం పట్టిన నేపథ్యాన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో గిరిజన ఆశ్రమ పాఠశాల, గురుకులాలలో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన గిరిజన దర్బార్‌లో ఆదివాసీ, గిరిజనుల దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే, విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా తరచూ పరీక్షలు నిర్వహించాలని, మెనూ ప్రకారం భోజనం అందిస్తూ మెరుగైన బోధన చేయాలని తెలిపారు. ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, అధికారులు బీం, తానాజీ, మునీర్‌పాషా, సురేష్‌బాబు, ప్రభాకర్‌రావు, రమణయ్య, శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఓను కలిసిన ఎమ్మెల్యే

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌ను ఎమ్మెల్యే పొదెం వీరయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజెన్సీలో గిరిజనుల అభివృద్ధికి అమలవుతున్న పథకాలపై వారు సమీక్షించారు. నాయకులు సరెళ్ల నరేష్, నల్లపు దుర్గప్రసాద్, బలుసు నాగసతీష్, సరెళ్ల వెంకటేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గురుకులంలో తనిఖీ

భద్రాచలంలోని గిరిజన గురుకుల విద్యాలయాలను పీఓ ప్రతీక్ తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఆయన, ఇటీవల పట్నా ఐఐటీలో సీటు సాధించిన కొర్సా లక్ష్మికి రూ.80 వేల విలువైన ఐపాడ్, సెల్‌ఫోన్ అందజేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన బాలిక ఐఐటీలో సాధించటం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల, కళాశాల తరగతి గదులను పరిశీలించి బోధన, భోజనంపై వివరాలు ఆరా తీశారు. ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్, కళాశాల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతిమయంగా బీఆర్‌ఎస్ పాలన

మాజీ ఎంపీ వి.హన్మంతరావు


చెక్‌డ్యామ్ కింద పంట నష్టపోయిన రైతుతో మాట్లాడుతున్న వీహెచ్

పాల్వంచరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఏ ప్రాజెక్టు చూసినా అవినీతి కనిపిస్తోందని మాజీ ఎంపీ వి.హన్మంతరావు విమర్శించారు. పాల్వంచ మండలం నాగారం వద్ద రూ.12.74 లక్షల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్ ఇటీవల వరదలతో కొట్టుకుపోగా సోమవారం ఆయన పరిశీలించారు. చెక్‌డ్యాం నిర్మించిన రెండేళ్లకే కొట్టుకుపోవడం ప్రభుత్వ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నిర్మాణ సమయంలో సక్రమంగా పర్యవేక్షిస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని చెప్పారు. కాగా, చెక్‌డ్యాం కింద పంటలు నష్టపోయిన రైతులకు కాంట్రాక్టర్ ద్వారా పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, నాయకులు కొండం వెంకన్నగౌడ్, చంద్రగిరి, సత్యనారాయణ, శ్రీనివాసరాజు, పాపారావు, నాగేశ్వరరావు, జలగం కృష్ణ పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న వీహెచ్

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని సోమవారం మాజీ ఎంపీ వి.హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నాక ఉపాలయాల్లో పూజలు చేశారు. నాయకులు సరెళ్ల నరేష్, కొత్త సీతారాములు, అడబాల వెంకటేశ్వరరావు, భోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు సతీష్, చెంచు సుబ్బారావు, తరుణ్ మిత్ర, సరెళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.